
క్లుప్తంగా

## పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


హెల్త్ క్యాంప్‌లో మున్సిపల్ కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం


భీమవరం(ప్రకాశం చౌక్): మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమీషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. భీమవరం పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణం నందు ఒమిక్స్ లాబరేటర్స్ వారి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ హెల్త్ క్యాంపు గురువారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఓమిక్స్ లాబరేటరీస్ అధినేత మధుబాబు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ సోమశేఖరం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా విజయీభవ యాత్ర


దసరా విజయీభవ యాత్ర దృశ్యం


భీమవరం (ప్రకాశంచౌక్): సాంప్రదాయబద్ధంగా దసరా విజయీభవ పండుగ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని భీమవరం దాసాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ ద్వార పురెడ్డి త్రివిక్రమ్ అన్నారు. గురువారం భీమవరం దాసాంజనేయస్వామి దేవస్థానం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దసరా విజయీభవ యాత్ర నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇటువంటి సంప్రదాయాలను తల్లిదండ్రులు పిల్లలకు తెలియజేయాలని, దసరా విజయీభవ శోభాయాత్రతో శాంతి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గంధం రాధ కుమారి, మదాసు కనకదుర్గ, వేగేశ్న రవి వర్మ, మంతెన రామరాజు, చిలువూరి అన్నపూర్ణ, కే విశ్వేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

## కొత్త ఆలోచనలు సమాజానికి ఉపయోగపడాలి


భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, టెక్నాలజీ వినియోగంతో సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలు తీసుకురావాలని విద్యార్థుల్లో ఉన్న ఆవిష్కరణ శక్తిని ప్రోత్సహించే వేదికగా స్పార్క్ ట్యాంక్ వంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విజయవాడ ఇన్క్యుబేషన్ హెడ్ దొనేపూడి రవితేజ అన్నారు. భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పార్క్ ట్యాంక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో పరిశోధన, స్టార్టప్ భావజాలం, జాతీయ స్థాయిలో పోటీ చేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ వివిఎస్ఎన్ నర్సింహరాజు మాట్లాడుతూ స్పార్క్ ట్యాంక్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను వెలికితీస్తాయని, నేటి యువత సమాజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను కనుగొని స్టార్టప్‌ల రూపంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి


భీమవరం కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పండగ సెలవులు అమలు చేయాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె తులసీరావు డిమాండ్ చేశారు. గురువారం భీమవరం ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ భీమవరం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ముహూర్తం ఎప్పుడో..?

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



కోలనపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న భవనాలు

కాళ్ల: మండలంలో పలు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ముందు చూపుతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాలు, హెల్త్ సెంటర్లు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తికాగా కొన్ని గ్రామాల్లో ఎన్నికలు రావడంతో చివరి దశలో ఉన్న నిర్మాణాలు చిన్న చిన్న పనుల కారణంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మించిన ప్రభుత్వ భవనాలను నిరుపయోగంగా వదిలేశారు. అంతేకాకుండా నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలను పట్టించుకోకుండా విస్మరించింది. దీంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలు అసంపూర్తిగా, నిరుపయోగంగా మిగిలిపోయాయి. మండలంలోని కలవపూడి, కోలనపల్లి, కాళ్ళ గ్రామాల్లో సుమారు లక్షలాది రూపాయలతో గ్రామాల్లో సచివాలయ భవనాలు నిర్మించారు. కానీ అవి ప్రారంభోత్సవానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. అదేవిధంగా మండలంలో దొడ్డనపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం 80% పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా వేంపాడు గ్రామంలో పునాదులోనే పనులు నిలిచిపోయాయి. అయినా వాటి గురించి పట్టించుకునే నాథుడు లేరని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. విశాలమైన గదులు, అన్ని సౌకర్యాలతో చేపట్టిన భవనాలు నిరుపయోగంగా ఉండటంతో ఎవరో పట్టించుకునే నాథులు లేకపోవడంతో నిరుపయోగంగా మిగిలాయి.

### సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయినా..

సచివాలయ సిబ్బంది విధులు పాత భవనాలలోని నిర్వహిస్తున్నారు. ఇలా వదిలేస్తే ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తైన ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని, అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


కాళ్ల లంకలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు


కలవపూడి గ్రామంలో సచివాలయం, హెల్త్ సెంటర్ భవనాలు


వేంపాడు గ్రామంలో పునాదిలో ఆగిపోయిన సచివాలయ భవన నిర్మాణం

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కుప్పనపూడిలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం
కుముదవల్లిలో మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు



పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి గ్రామపంచాయతీ వద్ద స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ భూపతి రాజు వంశీకృష్ణంరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలని ముఖ్యంగా మహిళలకు సంబంధించిన వ్యాధులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి వారికి సంక్రమించే దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించే విధంగా ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. మహిళలు ఈ ఉచిత వైద్య శిబిరాలపై అవగాహన కలిగి ఉండి శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 14 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను సరఫరా చేస్తామని, ముఖ్యంగా అసంక్రమిక వ్యాధులైన బిపి, సుగర్, మహిళలలో సంక్రమించి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ మొదలైన వాటికి పరీక్షలు నిర్వహించి ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే మెరుగైన వైద్యం నిమిత్తం ఉచితంగా సంబంధిత హాస్పటల్లో వైద్యం అందించేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉందన్నారు. అంతేకాకుండా ఈఉచిత శిబిరాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తామని, రక్తహీనత ఉన్నవారికి పోషకాహారంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలో వైద్య శిబిరం

కాళ్ల: కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభిమాన్ కార్యక్రమాని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీ ఆవరణలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం మహిళల పాలిట ఆరోగ్య సంజీవిని లాంటిదన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కోరా రామ్మూర్తి, ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వైద్యులు డాక్టర్ రంగనాయుడు, డాక్టర్ సరాబు సునీల్, గైనకాలజిస్ట్ డాక్టర్ వి.జయకుమారి, కె.నిరూపమ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరేటి వెంకటరత్నప్రసాద్, సర్పంచ్ బి.విజయ, తదితరులు పాల్గొన్నారు.


### వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు అందుబాటులో వైద్యం

ఆకివీడు: వైద్య శిబిరాల ద్వారా పల్లె ప్రజలకు వైద్యం, మందులు అందుబాటులోకి వచ్చాయని పీహెచ్‌సీ వైద్యులు రమేష్, గోవర్ధిని చెప్పారు. మండలంలోని కుప్పనపూడి సచివాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వైద్య శిబిరాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు సంక్రమిస్తున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు వైద్య శిబిరాలు అండగా నిలుస్తాయన్నారు. పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. శిబిరంలో 208 మంది వైద్యం పొంది, ఉచితంగా మందులు పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల అనురాధ, రత్నం, శ్రీనివాస్, ముద్దే కేశవ, కట్రెడ్డి ఏడుకొండలు, చింతా ఆదిశేషు, పట్టాభి, సీహెచ్ఓ జీవీ.రమణ పాల్గొన్నారు.

## నేడు పీ4పై శిక్షణ కార్యక్రమం

పాలకోడేరు: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ఆదేశానుసారం మండల స్థాయిలో పీ-4 అమలుపై మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది అందరికీ పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు . ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.

## మహాత్మాగాంధీ ఆశయాలు భావితరాలకు తెలియాలి


భీమవరంలో మహాత్మాగాంధీ జయంతోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

భీమవరం: మహనీయుల త్యాగాలు మహాత్మాగాంధీ ఆశయాలు భావితరాలకు తెలియడం కోసం వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహించడం ఒక స్ఫూర్తి అని భీమవరం సబ్ ట్రెజరీ అధికారి అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్తూపం వద్ద గురువారం శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతి, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ ఆశయాలు నేటి యువత నెరవేర్చాలన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జాతిపిత మహాత్మాగాంధీ జయంతోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ ఉద్యోగులు యువీ పాండురంగారావు, ప్రసాద్, ఇందుకూరి ప్రసాదరాజు, గాతల జేమ్స్, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు, ఎస్ కె చాన్‌భాషా, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసవర్మ

భీమవరం: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం భీమవరం బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీన్‌దయాలు ఉపాధ్యాయ చిత్రపటానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, కాయిత సురేంద్ర, అడబాల శివ, వబిలి శెట్టి ప్రసాదరావు, పచ్చిగోళ్ళ వెంకటేశ్వరరావు, కె లక్ష్మి, షేక్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జగజ్జననీ..నమోనమః


ఉండిలో మహాలక్ష్మీ అలంకరణలో దుర్గమ్మ

సాక్షి, నెట్‌వర్క్: దసరా శరన్నవరాత్రుల్లో నాల్గో రోజైన గురువారం భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ రూపాల్లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శ్రీకాత్యాయనీదేవిగా బాలాత్రిపుర సుందరీ అమ్మవారు


తోలేరులో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



కాత్యాయనీ అలంకరణలో ఆకివీడు వనువులమ్మ


అన్నపూర్ణాదేవి అలంకరణలో మావుళ్లమ్మ


శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా పంచారామక్షేత్రంలో పార్వతిదేవి



కాళ్ళకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు

## పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం


బొండాడలో బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో భూస్వాముల ప్రయోజనాల కోసం పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అన్నారు. బొండాడ గ్రామంలో కూల్చిన పేదల ఇళ్లను, ఖాళీగా ఉన్న ఇరిగేషన్ భూములను గురువారం గోపాలన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలపై యుద్ధం పేరుతో ఇల్లు కూల్చివేయడం దుర్మార్గమన్నారు. ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతోందన్నారు. బొండాడ గ్రామంలో సుమారు 70 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించి 25 రోజులైనా ఇప్పటికీ వారికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. నిర్వాసితులకు వెంటనే న్యాయం చేసి, మూడు సెంట్లు చొప్పున స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత సాధ్యం



ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద చెత్తను సేకరిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆనందం అని, ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్వచ్ఛతహి సేవ 2025లో భాగంగా ‘ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం భీమవరం పట్టణంలో పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఎడ్వర్డ్ ట్యాంక్ చుట్టూ మున్సిపల్ కార్పొరేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మెప్మా, మహిళలు చేపట్టిన శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమని అన్నారు. మున్సిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.హెచ్ఓ సోమశేఖర్, సిఎంఓ శివప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండు కిషోర్, ట్రెజరర్ బొండా వెంకట సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ నడిపెల్లి నరసింహారావు, డైరెక్టర్స్ మడిపల్లి శేఖర్, ఎస్వీఆర్ సి జయవర్మ, షేక్ బాబాజీ సాహెబ్, సభ్యులు గుండు గిరి, సుధీర్, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పాల్గొన్నారు.

## యనమదుర్రు డ్రెయిన్‌పై అప్రోచ్‌లు నిర్మించాలి

భీమవరం అర్బన్: మండలంలోని తోకతిప్ప, గొల్లవానితిప్ప గ్రామాల్లో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం వంతెనపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ గత పదేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెనలకు అప్రోచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో ప్రజలు అత్యవసరంగా ఈ వంతెనలపై ప్రయాణం ప్రమాదకరమని తెలిసినప్పటికీ ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఇటీవల ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అసెంబ్లీలో ప్రస్తావించి మంత్రి దృష్టిలో ఈ సమస్యను పెట్టినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా అప్రోచ్ రోడ్లు నిర్మించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ద్వారాలు, కిటికీలు లేని పాఠశాల భవనం



ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి ద్వారాలు, కిటికీలు లేవు. పాఠశాల పునఃనిర్మాణ పనులు చేపట్టి రెండున్నరేళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తి కాలేదు. గతంలో పురాతన భవనం కూలడానికి సిద్ధంగా ఉండటంతో, ఆభవనాన్ని పూర్తిగా తొలగించి నాడు-నేడు నిధులతో పునః నిర్మాణం చేపట్టారు. రెండు అంతస్తుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా ఒక అంతస్తు మాత్రమే నిర్మించారు. రెండు తరగతి గదులు నిర్మించి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి కిటికీలు, తలుపులు, గుమ్మాలు లేకుండా మొండి గోడలతో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మన బడి-మన భవిష్యత్ పథకం క్రింద నిధులు మంజూరు కావలసి ఉంది. అప్పటి వరకూ ఓరుగాలిలో విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించాల్సిందే.

## విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి


విద్యార్థులు స్టార్టప్ ద్వారా తయారు చేసిన డిజిటల్ స్క్రీన్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు సమాజానికి అవసరమైన నూతన ఆవిష్కరణలతో మంచి ఆలోచనలు ఆచరణలో పెట్టి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్నేషనల్ బిజినెస్ నెట్‌వర్క్ (బిఎన్‌ఐ) జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి శ్రీరామ్ అన్నారు.భీమవరం ఎస్ ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్లాస్ రూమ్ టు బోర్డ్ రూమ్ కాన్సెప్ట్‌తో విద్యార్థులు ఏ విధంగా స్టార్టప్స్ ఏర్పాటు చేయాలనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు ఈకళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ హెడ్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణమరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్ గోపాలకృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.